సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
RNI APTEL / 2018/76380
SK1 one NEWS HD
# సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మాద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మాద్ భాష | సంపుటి : 08 సంచిక : 16 | పేజిలు : 08, వెల రూ. 2 రూ/ | సోమవారం 06-04-2026

## పిక్చర్ అభీ బాకీ హై..
### సొంత పార్టీ నేతలకు రాఘవ్ చద్దా స్ట్రాంగ్ కౌంటర్



- తనపై సొంత పార్టీ నేతలు చేస్తున్న విమర్శలపై రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా తీవ్రంగా స్పందించారు
- తాను రాష్ట్రం కోసం పనిచేస్తున్నానని స్పష్టం చేశారు

## విజయ్ కొత్త అఫిడవిట్.. వెలుగులోకి రెండు కేసులు



చెన్నై: తమిళనాడు అసెంబ్లీకి ఏప్రిల్ 23న ఎన్నికల సమరం జరగనుంది. అయితే ఇంతలో టీవీకే అధినేత విజయ్ సవరించిన అఫిడవిట్ సమర్పించడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. తొలిసారి దాఖలు చేసిన అఫిడవిట్‌లో ప్రస్తావించని రెండు కేసుల వివరాలను తాజాగా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించిన కొత్త అఫిడవిట్‌లో ఆయన వెల్లడించారు. మార్చి 30న తొలి నామినేషన్ వేసిన విజయ్.. ఏప్రిల్ 3న నోటరీ చేయించి, ఏప్రిల్ 4న తన ప్రతినిధి ద్వారా సవరించిన అఫిడవిట్‌ను దాఖలు చేశారు. ఇందులో చెన్నై,

## మళ్లీ కృత్రిమ వర్షం.. సక్సెస్ అయ్యేనా?



ఢిల్లీలో మరోసారి కృత్రిమ వర్షం కురిపించేందుకు రంగం సిద్ధం

'క్లౌడ్ సీడింగ్' ప్రయోగాలను నిర్వహించేందుకు ఐఐటీ కాన్పూర్ సన్నాహాలు చేస్తోంది

## లచ్చమ్మ కుంట చెరువు.. హైడ్రాకు హరీష్ సవాల్

- భూముల విషయంలో పెద్దలే గద్దలుగా మారితే ఎలా
- హైదరాబాద్ నడిబొడ్డున 7000 కోట్ల భూ కుంభకోణం జరుగుతోంది
- ఈ భూములపై హైడ్రా ఎందుకు యాక్షన్ తీసుకోవడం లేదు
- ఈ నెల 7న ఈ భూములపై సుప్రీంకోర్టులో విచారణ



హైదరాబాద్: భూముల విషయంలో పెద్దలే గద్దలుగా మారితే ఎలా అని ప్రశ్నించారు మాజీ మంత్రి హరీష్ రావు. నాదర్‌గూల్ భూముల ఆక్రమణ వెనుక మంత్రి పొంగులేటి సభ్యులే ఉన్నారని ఆరోపించారు. హైదరాబాద్ నడిబొడ్డున 7000 కోట్ల భూ కుంభకోణం జరుగుతోందని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు తాజాగా మీడియాతో

# డిసెంబర్ 2027 నాటికి
# పూర్తి చేయడమే మా ప్రభుత్వం లక్ష్యం

### రాజేంద్రనగర్‌లో తెలంగాణ కొత్త హైకోర్టు... శంకుస్థాపన చేసిన సీజేఐ

- జోన్-2లో నివాస భవనాలకు శంకుస్థాపన
- "కొత్తగా నిర్మించే హైకోర్టు సమాజానికి, ప్రజాస్వామ్యానికి ఒక ప్రతీకగా నిలుస్తుంది
- ఇది మా ప్రభుత్వ ప్రజాస్వామ్య విలువలకు ప్రతిబింబం
- "న్యాయవ్యవస్థకు అత్యుత్తమ సౌకర్యాలు అందించడం కార్యనిర్వాహక విభాగం బాధ్యతగా భావిస్తున్నాం



హైదరాబాద్: 2027 డిసెంబర్ నాటికి తెలంగాణ హైకోర్టు నూతన భవన సముదాయాల నిర్మాణాలను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రకటించారు. హైకోర్టు కొత్త భవన సముదాయ నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో 49 కోర్టులు, నివాస భవనాల నిర్మాణ ప్రాజెక్టులను కూడా చేపడుతున్నట్టు చెప్పారు. రంగారెడ్డి జిల్లా



రాజేంద్రనగర్‌లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్-II నూతన భవన నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ గారు శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారితో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి ఎస్ నరసింహ గారు, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ గారు,


## మహిళలకు భద్రత కేవలం పథకం కాదు.. ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత : రాహుల్ గాంధీ

మహిళా సమస్యలను ప్రధాని మోడీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం

దేశవ్యాప్తంగా వస్తున్న ఫిర్యాదులను ఎందుకు పట్టించుకోవడం లేదు"



## తెలంగాణ అభివృద్ధి గాథను గ్లోబల్ వేదికపై పంచుకున్న కేటీఆర్



## కవిత కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరు?.. తెలంగాణ రాజకీయాల్లో పెను ప్రకంపనలు!



హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన కొత్త పార్టీ ఏర్పాటు ప్రయత్నాల్లో వేగం పెంచారు. ఈ నెల 25వ తేదీన పార్టీని ప్రారంభించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన ఆమె, దానికి 'తెలంగాణ రాష్ట్ర సమితి' (టీఆర్ఎస్) పేరును పరిశీలిస్తున్నట్లు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. "పాత పేరు, కొత్త జెండా, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తాను" అని ఆమె చెప్పడం ఈ చర్చకు మరింత బలాన్నిచ్చింది. దీంతో తెలంగాణ ఉద్యమంతో ముడిపడిన పేరును కవిత సొంతం చేసుకోబోతున్నారా? అనే ఉత్కంఠ నెలకొంది.

## తిరుమల కొండపై భక్తుల రద్దీ...

అమరావతి: తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వారాంతం కావడంతో కొండపై భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం నాడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు శిలాతోరణం వరకు బారులు తీరాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. టీటీడీ విడుదల చేసిన వివరాల ప్రకారం, నిన్న శనివారం (ఏప్రిల్ 4) ఒక్కరోజే 80,841 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 33,559 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.45 కోట్లుగా నమోదైందని టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ నేపథ్యంలో అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తూ, క్యూలైన్లలోని వారికి తాగునీరు, అల్పాహారం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# చొరబాటుదారులకు మమతా బెనర్జీ మద్దతు


## - ప్రధాని మోదీ ధ్వజం

- రాబోయే ఎన్నికల్లో బెంగాల్‌లో కాషాయ జెండా ఎగరడం ఖాయం
- అధికార పార్టీ దురాగతాలకు ప్రజలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతారని ప్రధాని మోడీ ధీమా వ్యక్తం
- కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాష్ట్ర భద్రతను పణంగా పెడుతున్నారు
- రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారికే రక్షణ లేనప్పుడు సామాన్యులకు ఎలా భద్రత ఉంటుంది
- 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం



ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో చొరబాటుదారులకు అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ బహిరంగంగా మద్దతు తెలుపుతోందని ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాష్ట్ర భద్రతను పణంగా పెడుతున్నారని ఆయన ఆరోపించారు. రాబోయే 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత కూచ్ బిహార్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన తొలి భారీ బహిరంగ సభలో ప్రధాని మోడీ ప్రసంగించారు. పోలింగ్ రోజున ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, టీఎంసీ నాయకులు బెదిరింపులకు పాల్పడినా ఏమాత్రం

## జగన్ పేరు కూడా అలాంటిదే - మంత్రి కొలుసు పార్థసారథి



- "ఏ నాయకుడూ చేయలేని సాహసాన్ని చంద్రబాబు చేశారు
- జగన్ 'కంటిలో నలుసులా', 'రాష్ట్రానికి పట్టిన చీడపీడలా' తయారయ్యాడు
- 2019-24 మధ్య జగన్ చెప్పిన 'అభివృద్ధి వికేంద్రీకరణ' నినాదం శుద్ధ అబద్ధమని పార్థసారథి స్పష్టం

అమరావతి: "గ్రామాల్లో శుభకార్యాల సమయంలో అమంగళకరమైన పేర్లు పలకకూడదని ఒక సంప్రదాయం ఉంటుంది. నేడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 'జగన్' అనే పేరు కూడా అలాంటిదే" అంటూ రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విమర్శలు చేశారు. రాజధాని అమరావతి విషయంలో జగన్ అనుసరించిన వైఖరి రాష్ట్రానికి తీరని నష్టం చేసిందని, ఆయనొక అభివృద్ధి నిరోధక శక్తి అని ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ తన కొత్త రాజధాని ప్రతిపాదనతో రాష్ట్ర ప్రజల ముందు నవ్వులపాలయ్యారని, సొంత పార్టీ శ్రేణులే ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయని అన్నారు.

జగన్... రాష్ట్రానికి పట్టిన చీడ

రాష్ట్రానికి రాజధాని నిర్మాణం ఒక గొప్ప సంబరం లాంటిదని, అలాంటి సమయంలో జగన్ 'కంటిలో నలుసులా', 'రాష్ట్రానికి పట్టిన చీడపీడలా' తయారయ్యారని

## ఇది జగన్ కొత్త ఆలోచన కాదు.. 11 ఏళ్ల క్రితమే చంద్రబాబు చెప్పారు: పట్టాభి



- సీఆర్డీఏను రద్దు చేయాలని చూసింది మీరు కాదా?
- పార్లమెంటు చట్టాన్ని రాష్ట్రం మార్చలేదు
- అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- 'మావిగన్' పేరిట గ్రోత్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలన్న మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యలపై పట్టాభిరామ్ తీవ్రంగా స్పందించారు

కర్నూలు సీమకిరణం నంద్యాల
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# పిక్చర్ అభీ బాకీ హై..

## సొంత పార్టీ నేతలకు రాఘవ్ చద్దా స్ట్రాంగ్ కౌంటర్

ఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీలో (ఆప్) అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. తనపై సొంత పార్టీ నేతలు చేస్తున్న విమర్శలపై రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా తీవ్రంగా స్పందించారు. పంజాబ్ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించడం లేదన్న ఆరోపణలను తిప్పికొడుతూ, తాను రాష్ట్రం కోసం పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ వీడియో క్లిప్‌ను పంచుకున్నారు. రాజ్యసభలో తాను పంజాబ్ సమస్యలపై మాట్లాడుతున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. "రాఘవ్ చద్దా పంజాబ్ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించడంలో విఫలమయ్యారని వీడియోలు విడుదల చేయమని ఒత్తిడికి గురైన నా సహచరులకు ఇది ఒక చిన్న ట్రైలర్ మాత్రమే... పిక్చర్ అభీ బాకీ హై" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. పంజాబ్ తనకు కేవలం చర్చనీయాంశం కాదని, అది తన ఇల్లు, విధి, మట్టి, ఆత్మ అని ఆయన ఉద్ఘాటించారు. ఇటీవల రాజ్యసభలో ఆప్ ఉప నేత పదవి నుంచి రాఘవ్ చద్దాను తొలగించిన తర్వాత ఈ వివాదం మొదలైంది. పార్టీలో కొందరు నేతలు ఆయనపై బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. దీనిపై చద్దా శనివారం స్పందిస్తూ, "నాపై మూడు ఆరోపణలు చేశారు. అందులో సున్నా శాతం నిజం ఉంది. నేను మౌనంగా ఉంటే, పదేపదే చెప్పే అబద్ధం కూడా నిజంలా అనిపిస్తుంది" అని పేర్కొన్నారు. తనపై ఒక పక్కా ప్రణాళిక ప్రకారం, పథకం ప్రకారం ప్రచారం జరుగుతోందని చద్దా ఆరోపించారు. "నాపై ఒకే రకమైన ప్రశ్నలు, ఒకే రకమైన ఆరోపణలు వస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు, సమన్వయంతో చేస్తున్న దాడి" అని ఆయన ఒక వీడియో సందేశంలో తెలిపారు. ప్రతిపక్షాలు వాకౌట్ చేసినప్పుడు తాను మద్దతు ఇవ్వలేదన్న వాదనను కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. "ఇది పూర్తిగా పచ్చి అబద్ధం. పార్లమెంటు చుట్టూ సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి. ఎవరైనా వాటిని తనిఖీ చేసి సమాధానం తెలుసుకోవచ్చు" అని ఆయన సవాల్ విసిరారు. తన పార్లమెంటరీ బాధ్యతలను విస్మరించారని పార్టీలోని ఒక వర్గం ఆరోపిస్తుండగా, తన దృష్టి మొత్తం పంజాబ్, దాని ప్రజల పైనే ఉందని, వారి సమస్యలను రాజ్యసభలో నిరంతరం ప్రస్తావిస్తూనే ఉంటానని చద్దా పునరుద్ఘాటించారు.

## విజయ్ కొత్త అఫిడవిట్.. వెలుగులోకి రెండు కేసులు

మొదటి పేజి తరువాయి

ఏప్రిల్ 4న తన ప్రతినిధి ద్వారా సవరించిన అఫిడవిట్‌ను దాఖలు చేశారు. ఇందులో చెన్నై, మదురైలకు చెందిన రెండు క్రిమినల్ కేసుల వివరాలను కొత్తగా చేర్చారు.

ఆ రెండు కేసులు ఇవే..

మొదటి ఎఫ్ఐఆర్ (74/2026) చెన్నైలోని పెరవళ్లూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. మార్చి 30న ఎన్నికల ప్రచారంలో ప్రజాశాంతికి భంగం కలిగించారనేది ఆరోపణ. అయితే ఏప్రిల్ 2న సోషల్ మీడియా ద్వారానే ఈ కేసు గురించి తనకు తెలిసిందని విజయ్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రెండో ఎఫ్ఐఆర్ (108/2025) మదురై జిల్లా కూడకోవిల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. 2025 ఆగస్టు 21న జరిగిన పార్టీ సదస్సులో విజయ్ ర్యాంప్ వాక్ చేస్తుండగా, బౌన్సర్లు నెట్టివేయడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయనేది దీని సారాంశం. ఈ ఫిర్యాదుపై తనకు ఇంకా ఎలాంటి అధికారిక సమన్లు అందలేదని విజయ్ స్పష్టం చేశారు.

కోట్లలో ఆస్తులు.. పన్ను బకాయిలు..

క్రిమినల్ కేసుల జాబితా మారినా ఆస్తుల వివరాలు దాదాపు పాత అఫిడవిట్ మాదిరిగానే ఉన్నాయి. ఆయన చరాస్తుల విలువ గతంలో రూ.404.58 కోట్లు ఉండగా, అది కాస్తా రూ. 410.59 కోట్లకు పెరిగింది. ఇందులో రూ. 15 లక్షల విలువైన వెండి, రూ. 1.20 కోట్లకు పైగా విలువైన 883 గ్రాముల బంగారం ఉన్నాయి. నీలాంకరై, సాలిగ్రామంలోని వాణిజ్య, నివాస భవనాలతో కలుపుకుని ఆయన స్థిరాస్తుల విలువ రూ. 220.15 కోట్లు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి తన ఆదాయం రూ. 184.53 కోట్లుగా చూపించిన ఆయన.. సుమారు రూ. 3.44 కోట్ల ఆదాయపు పన్ను బకాయిల వివాదం అప్పీలు దశలో ఉన్నట్లు వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో విజయ్.. పెరంబూర్, తిరుచిరాపల్లి ఈస్ట్ స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు. తిరుచిరాపల్లి ఈస్ట్ స్థానానికి (ఏప్రిల్ 2న దాఖలు) ఇచ్చిన వివరాలకు, తొలిసారి పెరంబూర్ స్థానానికి ఇచ్చిన వివరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను సరిచేస్తూ, పెండింగ్ క్రిమినల్ కేసులన్నింటినీ బహిర్గతం చేయాలనే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విజయ్ ఈ కొత్త అఫిడవిట్‌ను దాఖలు చేసినట్లు సమాచారం.

## మళ్లీ కృత్రిమ వర్షం.. సక్సెస్ అయ్యేనా?

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి కృత్రిమ వర్షం కురిపించేందుకు రంగం సిద్ధమవుతోంది. వాయు కాలుష్యాన్ని కట్టడి చేసే అత్యవసర చర్యల్లో భాగంగా, ఈ వేసవిలో (ఏప్రిల్ - జూన్ 2026 మధ్య) 'క్లౌడ్ సీడింగ్' ప్రయోగాలను నిర్వహించేందుకు ఐఐటీ కాన్పూర్ సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రయోగాల కోసం ఐఐటీ కాన్పూర్ ఇప్పటికే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అనుమతి కోరింది. అధికారిక ఆమోదం లభించిన వెంటనే ట్రయల్స్ ప్రారంభం కానున్నాయి. వాస్తవానికి ఢిల్లీ పర్యావరణ శాఖ, ఐఐటీ కాన్పూర్ మధ్య 2025 సెప్టెంబర్ 25న ఒక కీలక ఒప్పందం కుదిరింది. అందులో భాగంగానే గత ఏడాది అక్టోబర్‌లో రెండుసార్లు ప్రయోగాలు నిర్వహించినప్పటికీ నగరంలో వర్షం కురవలేదు. మేఘాల్లో తేమ శాతం తక్కువగా (కేవలం 15 నుంచి 20 శాతమే) ఉండటం కారణంగానే నాటి ప్రయోగాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదని ఐఐటీ కాన్పూర్ వెల్లడించింది. అయితే ఆ వైఫల్యం ద్వారా భవిష్యత్తు ప్రయోగాలకు పనికొచ్చే కీలక వాతావరణ పరిస్థితుల గురించి నేర్చుకున్నామని తెలిపింది.

క్లౌడ్ సీడింగ్ అంటే ఏంటి?

మేఘాల నుంచి వర్షం పడే అవకాశాలను కృత్రిమంగా పెంచే ప్రక్రియనే క్లౌడ్ సీడింగ్ అంటారు. విమానాల ద్వారా మేఘాల్లోకి సిల్వర్ అయోడైడ్, అయోడైజ్డ్ ఉప్పు, రాక్ సాల్ట్ వంటి రసాయనాలతో కూడిన ఫ్లేర్లను వదులుతారు. ఇవి మేఘాల్లో మంచు స్ఫటికాలు లేదా నీటి బిందువులు త్వరగా ఏర్పడేలా చేసి, వర్షం కురిసేలా చేస్తాయి. దీనివల్ల గాలిలోని కాలుష్య కణాలు కిందికి చేరి గాలి శుభ్రపడుతుంది. గత అక్టోబర్ ప్రయోగాల వల్ల వర్షం పడకపోయినా, లక్ష్యంగా ఎంచుకున్న ప్రాంతాల్లో కాలుష్య కారకాలు (పర్టిక్యులేట్ మ్యాటర్) తగ్గాయని ఢిల్లీ ప్రభుత్వం ఒక నివేదికలో పేర్కొంది. ఇటీవలే విడుదలైన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఢిల్లీ 2025-26' సైతం భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సహకారంతో మరిన్ని ప్రయోగాలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, చేయబోయే ఈ ప్రయోగం సక్సెస్ అయి, ఢిల్లీవాసులకు కాలుష్యం నుంచి ఊరటనిస్తుందేమో వేచి చూడాలి.

## లచ్చమ్మ కుంట చెరువు.. హైడ్రాకు హరీష్ సవాల్

మొదటి పేజి తరువాయి

మాజీ మంత్రి హరీష్ రావు తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'దళితుల భూములను కాంగ్రెస్ భక్షించే ప్రయత్నం జరుగుతోంది. నాదర్‌గూల్ భూముల కుంభకోణం జరిగింది. పేదల భూముల్లోకి వారిని పోకుండా అడ్డుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. నాదర్‌గూల్ భూముల కోసం చాలా ఏళ్లుగా పోరాటం జరుగుతుంది. ఈ భూమి తనదేనని రాజ్ బహదూర్ కోర్టులో పోరాటం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చడం జరిగింది. ప్రస్తుతం ఈ భూముల వ్యవహారం సుప్రీంకోర్టులో ఉంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌లో ఈ ల్యాండ్ ప్రభుత్వ భూమిగా పేర్కొంది. ఈ భూములను కాపాడాల్సిన బాధ్యత ఆర్డీవోది. దీనిపై అక్కడి రైతులు రెవెన్యూ అధికారులకి, హైడ్రా కమిషనర్‌కి ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించడం లేదు. నాటి ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన భూమిని రేవంత్ రెడ్డి లాకుంటున్నారు. స్వయంగా రెవెన్యూ మంత్రే ఈ భూముల ఆక్రమణ వెనుక ఉంటే అధికారులు ఎలా చర్యలు తీసుకుంటారు. రేవంత్ రెడ్డి అసెంబ్లీలో భూములను ఆక్రమిస్తే ఎవర్నీ వదలను అన్న సీఎం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఈ భూములపై హైడ్రా ఎందుకు యాక్షన్ తీసుకోవడం లేదు. లచ్చమ్మ కుంట చెరువును అక్కడ పెద్దలు ఆక్రమిస్తుంటే హైడ్రా కమిషనర్ ఏం చేస్తున్నారు?. చెరువులను కాపాడుతా అనే హైడ్రాకు కళ్లు కనబడటం లేదా?. హైడ్రా కమిషనర్‌కి సవాల్ చేస్తున్నా. రేపు హైడ్రా కమిషనర్ రావాలి లేదా మా ఎమ్మెల్యేలతో నేనే వెళ్తాను. మరోవైపు 80 ఎకరాల గుట్టలు మాయం చేస్తూ కోట్లు కొల్లగొడుతున్నారు. ఈ నెల 7న ఈ భూములపై సుప్రీంకోర్టులో విచారణ ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వారంలోనే ఈ భూమి కోహినూర్‌కి చెందింది అని బోర్డు పెట్టారు. శిల్పా ఇన్‌ఫ్రా పొంగులేటి కుమారుడిది. ఈ భూముల వెనుక పొంగులేటి కుటుంబ సభ్యులే ఉన్నారు అంటూ' వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణ అభివృద్ధి గాథను గ్లోబల్ వేదికపై పంచుకున్న కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి గాథను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతర్జాతీయ వేదికపై పంచుకున్నారు. అమెరికా న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించిన ప్రతిష్టాత్మక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ 2026లో పాల్గొన్న కేటీఆర్.. తెలంగాణ రాష్ట్ర పురోగతిపై తన అనుభవాలను పంచుకున్నారు. పోరాటాలు, త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో కేవలం పదేళ్లలోనే దేశానికి మార్గదర్శకంగా నిలిచే స్థాయికి ఎదిగామని పేర్కొన్నారు. వ్యవసాయం, ఐటీ, పరిశ్రమలు, సంక్షేమ రంగాల్లో తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలను ఆయన వివరించారు.తెలంగాణ పర్యాటకం ఈ కాన్ఫరెన్స్‌లో వ్యాపారం, ఆవిష్కరణలు, భవిష్యత్ విధానాలపై లోతైన చర్చ జరిగిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ దేశాల నుంచి వచ్చిన వ్యాపారవేత్తలు, నిపుణులతో జరిగిన సంభాషణలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధి నమూనా అంతర్జాతీయ వేదికలపై గుర్తింపు పొందడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు

# డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయడమే మా ప్రభుత్వం లక్ష్యం

మొదటి పేజి తరువాయి




ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారితో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి ఎస్ నరసింహ గారు, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ గారు, జస్టిస్ ఎస్ వెంకటనారాయణ భట్టి గారు, జస్టిస్ అలోక్ ఆరాధే గారు, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ గారితో పాటు ఇతర న్యాయకోవిదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, "2023 డిసెంబర్‌లో మా ప్రభుత్వం ఏర్పడినప్పుడు తీసుకున్న మొదటి నిర్ణయాల్లో హైకోర్టుకు కొత్త భవన సముదాయాన్ని నిర్మించాలన్న నిర్ణయం ఒకటి. అందుకోసం రాజేంద్రనగర్‌లో 100 ఎకరాలకు పైగా భూమిని కేటాయించాం. భవనాల కోసం జోన్-1లో ఇప్పటికే ప్రారంభించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రోజు జోన్-2లో నివాస భవనాలకు ఈరోజు శంకుస్థాపన చేసుకున్నాం. వీటి నిర్మాణాలను డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది" అని చెప్పారు. "న్యాయవ్యవస్థకు అత్యుత్తమ సౌకర్యాలు అందించడం కార్యనిర్వాహక విభాగం బాధ్యతగా భావిస్తున్నాం. ఇక్కడ నిర్మించబోయే భవనం దేశంలోనే అతిపెద్ద హైకోర్టు సముదాయాల్లో ఒకటిగా మాత్రమే కాకుండా, ఆధునికత, మౌలిక వసతుల పరంగా ఒక ప్రమాణంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు పరస్పర ఆధారపడి, గౌరవంతో పనిచేస్తాయి. సాధారణ పౌరుడు న్యాయం కోసం చివరగా ఆశ్రయించేది న్యాయస్థానాన్నే. అలాంటి న్యాయస్థానానికి కావలసిన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం జీవితంలో నాకు లభించిన ఒక గొప్ప అవకాశంగా భావిస్తా" అని అన్నారు. "కొత్తగా నిర్మించే హైకోర్టు సమాజానికి, ప్రజాస్వామ్యానికి ఒక ప్రతీకగా నిలుస్తుంది. ఇది పేదలు, బలహీనులు న్యాయం కోసం వచ్చే వారికి వేదికగా నిలుస్తుంది. రాబోయే వంద సంవత్సరాల పాటు పేదలు, బలహీనులు, అణగారిన వర్గాలు న్యాయం కోసం ఈ మందిరానికి వస్తారు. దేశంలో ఒక దేవాలయం, మసీదు, చర్చి, గురుద్వారా నిర్మించడం గొప్ప విషయం. కానీ ఒక కోర్టు సముదాయం నిర్మించడమంటే, అందుకోసం ప్రత్యేకంగా ప్రాంగణం సృష్టించడమంటే, దీన్ని ప్రజలందరి కోసం నిర్మించే ఒక పవిత్ర ఆలయంగా భావిస్తా" అని ముఖ్యమంత్రి గారు చెప్పారు. "ఇదొక ప్రత్యేకమైన సందర్భం. భారతదేశంలోని అగ్రశ్రేణి న్యాయ మేధావులతో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా ఉంది. ఇలాంటి సందర్భం చాలా అరుదుగా వస్తుంది. దేశంలోనే అతిపెద్ద హైకోర్టు భవన సముదాయమే కాకుండా అత్యున్నత ప్రమాణాలు, మౌలిక సదుపాయాలతో నిర్మిస్తున్నాం. ఈ భవన సముదాయం కేవలం నిర్మాణం కాదు. ఇది మా ప్రభుత్వ ప్రజాస్వామ్య విలువలకు ప్రతిబింబం. అన్ని వ్యవస్థలు పరస్పర గౌరవంతో, సహకారంతో పనిచేయాలని మేం విశ్వసిస్తాం. న్యాయవ్యవస్థ పట్ల మా ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని ఇస్తుంది. ఇది హైదరాబాద్‌కు ఒక సుదినం. వచ్చే శతాబ్దం కోసం ఒక అద్భుతమైన భవనాన్ని, ప్రజా జీవితానికి ఒక కీలకమైన స్థంభాన్ని నిర్మించడానికి ఒక అడుగు వేస్తున్న సందర్భం. న్యాయకోవిదులందరితో కలిసి ఇక్కడ ఉండటం అదృష్టంగా భావిస్తున్నా" అని ముఖ్యమంత్రి గారు అన్నారు.

## ఇది జగన్ కొత్త ఆలోచన కాదు.. 11 ఏళ్ల క్రితమే చంద్రబాబు చెప్పారు: పట్టాభి



అమరావతి: విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం ప్రాంతాలను కలుపుతూ 'మావిగన్' పేరిట గ్రోత్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలన్న మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యలపై టీడీపీ నేత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రంగా స్పందించారు. జగన్ ఇప్పుడు చెబుతున్నది కొత్త ఆలోచన కాదని, 11 సంవత్సరాల క్రితమే నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఈ ప్రణాళికకు శ్రీకారం చుట్టారని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తమకు ఎవరూ అభివృద్ధి పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని, ఏ ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసని పట్టాభి వ్యాఖ్యానించారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్ లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

11 ఏళ్ల క్రితమే చంద్రబాబు విజన్

2014లో రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రచించారని పట్టాభి గుర్తుచేశారు. ఇందులో భాగంగానే 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించి, క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్డీఏ)ను ఏర్పాటు చేశారని తెలిపారు. దాదాపు 8,350 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో సీఆర్డీఏను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మచిలీపట్నం సమీపంలోని మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాల నుంచి గుంటూరు దాటి ఎడ్లపాడు వరకు సీఆర్డీఏ పరిధి విస్తరించి ఉందని, ఈ మ్యాప్ చూస్తే చంద్రబాబు దార్శనికత ఏమిటో అర్థమవుతుందని అన్నారు. "ఇప్పుడు జగన్ గారు చెబుతున్న గ్రోత్ కారిడార్ ఆలోచన 2015 సెప్టెంబర్ 22న జారీ చేసిన జీవో నంబర్ 207లోనే ఉంది. మచిలీపట్నం నుంచి ఎడ్లపాడు వరకు ఉన్న ప్రాంతమంతా అభివృద్ధి చేయాలనేది చంద్రబాబు నాటి ప్రణాళిక" అని పట్టాభి పేర్కొన్నారు.

సీఆర్డీఏను రద్దు చేయాలని చూసింది మీరు కాదా?

ఈ ప్రాంతంపై ఇప్పుడు కొత్తగా ప్రేమ చూపిస్తున్న జగన్మోహన్ రెడ్డి, 2020లో ఇదే సీఆర్డీఏ చట్టాన్ని రద్దు చేసేందుకు ఎందుకు ప్రయత్నించారని పట్టాభి ప్రశ్నించారు. మూడు రాజధానుల పేరుతో ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవాలని చూసింది నిజం కాదా అని నిలదీశారు. "ఒకవైపు హైదరాబాద్‌లో హెచ్ఎండీఏ, ఔటర్ రింగ్ రోడ్డుతో చంద్రబాబు ఎలా అభివృద్ధి చేశారో అందరికీ తెలుసు. అదే తరహా విజన్‌తో ఏపీలో సీఆర్డీఏను ఏర్పాటు చేస్తే, దాన్ని నాశనం చేయాలని జగన్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఇప్పుడు ఓటమి తర్వాత మళ్లీ ఈ ప్రాంతంపై ప్రేమ నటిస్తున్నారు" అని ఆయన విమర్శించారు.

బిల్లు వేరు.. తీర్మానం వేరు

అమరావతి రాజధానిపై అసెంబ్లీలో తీర్మానం చేసి కౌన్సిల్‌కు ఎందుకు పంపలేదని వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పట్టాభి ఆరోపించారు. బిల్లుకు, తీర్మానానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. "బిల్లు అనేది చట్టరూపం దాల్చాలంటే ఉభయ సభల ఆమోదం తప్పనిసరి. కానీ, తీర్మానం (రెజల్యూషన్) అనేది కేవలం ఒక అభిప్రాయాన్ని వ్యక్తపరచడం కోసం చేసేది. కేంద్ర ప్రభుత్వం ఏపీ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసి పంపమని కోరింది. అందుకే అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాం. ఆ తర్వాత కేంద్రం పార్లమెంటులో బిల్లు పెట్టి ఉభయ సభల్లో ఆమోదింపజేసింది. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన మూడు రాజధానుల అంశం 'బిల్లు' కాబట్టే కౌన్సిల్‌కు వెళ్లింది. కానీ ఇది కేవలం 'తీర్మానం' మాత్రమే," అని ఆయన స్పష్టం చేశారు.

పార్లమెంటు చట్టాన్ని రాష్ట్రం మార్చలేదు

జగన్మోహన్ రెడ్డి ఎన్ని మాట్లాడినా అమరావతి అభివృద్ధిని ఆపడం ఎవరివల్లా కాదని పట్టాభి అన్నారు. పార్లమెంటులో ఆమోదం పొందిన చట్టాన్ని ఒక రాష్ట్ర అసెంబ్లీ మార్చలేదన్న కనీస అవగాహన లేకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో అమరావతి పనులు వేగంగా ముందుకు సాగుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే సీఎం సమీక్షలు నిర్వహించి పనులకు టార్గెట్లు నిర్దేశించారని, త్వరలోనే రాజధానిలో భవనాలు వేగంగా పైకి లేస్తాయని అన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

కూటమి ప్రభుత్వం కేవలం అమరావతికే పరిమితం కాదని, ఉత్తరాంధ్ర, రాయలసీమతో సహా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని పట్టాభి తెలిపారు. ఉత్తరాంధ్రకు ఆర్సెలార్ మిట్టల్, అదానీ డేటా సెంటర్ వంటి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, రాయలసీమకు పరిశ్రమలు తీసుకురావడంతో పాటు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కూడా చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని చెప్పారు. నారా లోకేష్ లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నారని, అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించడం తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## జగన్ పేరు కూడా అలాంటిదే - మంత్రి కొలుసు పార్థసారథి

మొదటి పేజి తరువాయి



రాష్ట్రానికి రాజధాని నిర్మాణం ఒక గొప్ప సంబరం లాంటిదని, అలాంటి సమయంలో జగన్ 'కంటిలో నలుసులా', 'రాష్ట్రానికి పట్టిన చీడపీడలా' తయారయ్యారని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత అన్ని రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా అమరావతికి మద్దతు తెలిపితే, ఒక్క వైసీపీ మాత్రమే పార్లమెంటులో వాకౌట్ చేసి రాష్ట్ర ప్రయోజనాలకు గండికొట్టిందని గుర్తుచేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాల్సిన రాజధాని విషయంలో జగన్ వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని విమర్శించారు. ఆయన పాలనలో రాష్ట్రం ఐదేళ్ల పాటు చీకటి రోజులను చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వికేంద్రీకరణ పేరుతో చారిత్రక తప్పిదం

2019-24 మధ్య జగన్ చెప్పిన 'అభివృద్ధి వికేంద్రీకరణ' నినాదం శుద్ధ అబద్ధమని పార్థసారథి స్పష్టం చేశారు. "అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు ప్రకటించి, అధికారంలోకి రాగానే మాట మార్చారు. సూట్‌కేసు రాజకీయాలు చేస్తూ రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారు. ప్రజలు ఈ నాటకాన్ని గమనించి, మూడు రాజధానుల ఆలోచనను ఛీత్కరించి కేవలం 11 సీట్లకు పరిమితం చేశారు" అని ఎద్దేవా చేశారు. చేసిన తప్పులను ఒప్పుకోకుండా, ప్రజల అభిప్రాయాన్ని గౌరవించకుండా తన ఆలోచనలనే రుద్దే నియంతలా జగన్ వ్యవహరించారని మండిపడ్డారు. రాజధాని పేరును 'మావిగన్'గా మార్చాలని చూడటం ఆయన 'తుగ్లక్' పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు.

అమరావతి.. ఐదు కోట్ల మంది ఆత్మగౌరవం

విభజనతో నష్టపోయిన ఆంధ్రులకు అమరావతి ఒక ఆత్మగౌరవ ప్రతీక అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. "ఏ నాయకుడూ చేయలేని సాహసాన్ని చంద్రబాబు చేశారు. ఆయన ఒక్క పిలుపుతో రైతులు 34,000 ఎకరాల విలువైన భూములను రాజధాని కోసం త్యాగం చేశారు. అమరావతి ఒక 'సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్'. ఈ రోజు హైదరాబాద్ తెలంగాణకు లక్షల కోట్ల ఆదాయాన్ని అందిస్తోంది. అదే స్థాయిలో అమరావతి అభివృద్ధి చెందితే, ఏటా వచ్చే 4-5 లక్షల కోట్ల ఆదాయంతో రాష్ట్రంలోని ప్రతీ మూలను అభివృద్ధి చేయవచ్చు" అని వివరించారు. అమరావతిలో పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ అని ఆయన స్పష్టం చేశారు.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు

గత 20 నెలల కూటమి పాలనలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాట పట్టిందని పార్థసారథి తెలిపారు. వైసీపీ ప్రభుత్వం సాధించలేకపోయిన వేల కోట్ల రూపాయల కేంద్ర నిధులను సాధించి ప్రజా సంక్షేమానికి వినియోగిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించి సమగ్రాభివృద్ధి చేస్తున్నామన్నారు. కర్నూలుకు కారిడార్, ప్రకాశం-నెల్లూరు జిల్లాల్లో పోర్టులు, రిఫైనరీ, విశాఖను డేటా సెంటర్, సాఫ్ట్‌వేర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. "పెట్టుబడిదారులు వసతులు, కనెక్టివిటీ ఉన్న చోటుకే వస్తారు. జగన్‌లా 'చెట్టు కింద కూర్చుని చర్చలు జరపండి' అంటే ఎవరూ రారు" అని ఆయన ఎద్దేవా చేశారు. అప్పులు తెచ్చినా, సంపద సృష్టించి వాటిని తీర్చే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందని, జగన్ ఇప్పటికైనా అబద్ధాలు మాని వాస్తవాలు గ్రహించాలని హితవు పలికారు.

## మహిళలకు భద్రత కేవలం పథకం కాదు.. ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : "మహిళలకు భద్రత కేవలం పథకం మాత్రమే కాదు, అది ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత" అని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తెలిపారు. మహిళా సమస్యలను ప్రధాని మోడీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హింసకు గురైన మహిళలకు అండగా నిలిచే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన 'వన్ స్టాప్ సెంటర్ల (ఒఎస్‌సిఎస్)'కు సంబంధించిన సమస్యల పట్ల కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆదివారం సోషల్‌మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. "ఒక మహిళ హింస నుండి రక్షణ కోసం వన్‌స్టాప్ సెంటర్ (ఒఎస్‌సి)కి చేరుకున్నప్పుడు.. ఆ మహిళలకు ఎందుకు సహాయం లభించడం లేదు. ఎందుకు ఆసంస్థ తలుపులకు తాళాలు కనిపిస్తున్నాయి. సిబ్బంది కొరత ఎందుకు ఉంది. దేశవ్యాప్తంగా వస్తున్న ఫిర్యాదులను ఎందుకు పట్టించుకోవడం లేదు" అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పరిస్థితి సంతృప్తికరంగా ఉందని ప్రకటిస్తోందని, ఒక వేళ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటే ఒఎస్‌సిలకు సంబంధించి ఇన్ని సమస్యలు ఉన్నట్లు నివేదికలు ఎందుకు వెలుగులోకి వస్తున్నాయని కేంద్రాన్ని నిలదీశారు. భద్రత అనేది ప్రాధాన్యత అయినట్లైతే, ప్రతి ఐదుగురు మహిళల్లో ముగ్గురికి ఎందుకు సాయం ఇంకా అందడం లేదనది ప్రశ్నించారు. మహిళా,శిశుసంక్షేమ శాఖకు కేటాయించిన ప్రతి రూ.100లో కేవలం 60పైసలు మాత్రమే ఒఎస్‌సిల కోసం ఎందుకు ఖర్చు చేస్తున్నారని నిలదీశారు. మార్చి 27న లోక్‌సభలో నిర్వహించిన ప్రశ్నోత్తరాలలో రాహుల్ గాంధీ ఈ ప్రశ్నలను అడిగారు. " ఓఎస్‌సీలు తాళం వేసి ఉన్నాయా, పనిచేయడం లేదా నిర్దేశించిన విధంగా 24 గంటలూ పనిచేయడంలో విఫలమవుతున్నాయా, విఫలమైతే వాటి వివరాలు తెలియజేయాలి. గత ఐదేళ్లలో రాష్ట్రాల వారీగా, సంవత్సరాల వారీగా ఒఎస్‌సిలలో సహాయం, ఆశ్రయం పొందిన మహిళల సంఖ్య, అలాగే నమోదైన కేసుల సంఖ్యను తెలపాలని కోరారు". ఈ ప్రశ్నకు మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. "ఒఎస్‌సి అనేది 'మిషన్ శక్తి' కింద ఉన్న 'సంబల్' విభాగంలో ఒక భాగమని, ఇది ప్రైవేట్ మరియు పబ్లిక్ ప్రదేశాలలో హింసకు గురైన, ఇబ్బందుల్లో ఉన్న మహిళలకు సమగ్రమైన, తక్షణ మద్దతును అందిస్తుంది. ఇది అవసరమైన మహిళలకు వైద్య సహాయం, న్యాయ సహాయం, సలహా, తాత్కాలిక ఆశ్రయం, పోలీసు సహాయం,మానసిక-సామాజిక కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తుంది. ఒఎస్‌సి ప్రారంభమైనప్పటి నుండి, అంటే 2015 ఏప్రిల్ 1 నుండి డిసెంబర్ 31 వరకు దేశంలో 13.37 లక్షలకు పైగా మహిళలు సహాయం పొందారు" అని ఆమె పేర్కొన్నారు.

## చొరబాటుదారులకు మమతా బెనర్జీ మద్దతు

మొదటి పేజి తరువాయి

పోలింగ్ రోజున ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, టీఎంసీ నాయకులు బెదిరింపులకు పాల్పడినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలన తీసుకురావడానికి ప్రజలంతా బీజేపీకి అండగా నిలవాలని ఆయన కోరారు. బెంగాల్ రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న ఈ అవినీతి ప్రభుత్వాన్ని శాశ్వతంగా సాగనంపే సమయం ఆసన్నమైందని ప్రధాని మోడీ ప్రజలకు స్పష్టం చేశారు. టీఎంసీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను కనీసం లెక్కచేయడం లేదని ప్రధాని మోడీ మండిపడ్డారు. మాల్డాలో రెండు మూడు రోజుల క్రితం జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనమని గుర్తు చేశారు. స్వయంగా న్యాయమూర్తులను, న్యాయాధికారులను కొందరు వ్యక్తులు బందీలుగా పట్టుకోవడం దేశవ్యాప్తంగా ఉన్న పౌరులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏ వ్యవస్థపైనా ఈ ప్రభుత్వానికి కనీస గౌరవం లేదని, ఇది అత్యంత దారుణమైన పాలన అని మోడీ విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారికే రక్షణ లేనప్పుడు సామాన్యులకు ఎలా భద్రత ఉంటుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. మాల్డాలో జరిగిన దాడి కేవలం ఒక అహంకార పూరిత చర్య మాత్రమే కాదని, ఇది పూర్తిగా టీఎంసీ ప్రభుత్వ మద్దతుతో నడుస్తున్న జంగిల్ రాజ్ అని మోడీ దుయ్యబట్టారు. న్యాయస్థానాలు, రాజ్యాంగ ప్రక్రియలు కూడా సురక్షితంగా లేని ఇలాంటి వ్యవస్థను ఏమాత్రం సహించకూడదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, గుండాలు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారని ఆరోపించారు. టీఎంసీ అరాచకాల వల్ల బెంగాల్‌లో సాధారణ ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కరువైందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కూచ్ బిహార్‌లోని రాస్ మేలా మైదానంలో ప్రధాని మోడీ భారీ బహిరంగ సభ నిర్వహించడం ఇది నాలుగోసారి. గతంలో 2019, 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో, 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ఆయన ఇక్కడే ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇప్పుడు 2026 అసెంబ్లీ ఎన్నికల నగారా మోగిన తర్వాత మోడీ పాల్గొన్న తొలి సభ కావడంతో దీనికి ఎంతో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే ఎన్నికల్లో బెంగాల్‌లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని, అధికార పార్టీ దురాగతాలకు ప్రజలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతారని ప్రధాని మోడీ ధీమా వ్యక్తం చేశారు.

## కవిత కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరు?.. తెలంగాణ రాజకీయాల్లో పెను ప్రకంపనలు!



మొదటి పేజి తరువాయి

దీంతో తెలంగాణ ఉద్యమంతో ముడిపడిన పేరును కవిత సొంతం చేసుకోబోతున్నారా? అనే ఉత్కంఠ నెలకొంది. కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ పార్టీ, 'భారత రాష్ట్ర సమితి' (బీఆర్ఎస్)గా మారడంతో ప్రస్తుతం టీఆర్ఎస్ పేరు ఎవరైనా వాడుకోవచ్చని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ సెంటిమెంట్‌తో పాటు టీఆర్ఎస్ పేరుతో ముడిపడిన భావోద్వేగాలను తనవైపు తిప్పుకోవాలనేది ఆమె వ్యూహంగా కనిపిస్తోంది. అయితే, పార్టీ పేరు టీఆర్ఎస్ అయినా జెండాలో మాత్రం గులాబీ రంగు ఉండదని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల పునాదిపై నడుస్తుందని, 'బిహార్ సిద్ధాంతాలకు' తమ పార్టీలో చోటుండదని స్పష్టం చేశారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం తెలంగాణ జాగృతి బృందం ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం వద్ద 'తెలంగాణ ప్రజా జాగృతి పార్టీ' పేరుతో ప్రక్రియ ప్రారంభించింది. తమకు ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీ అని కవిత ప్రకటించారు. అదే సమయంలో బీఆర్ఎస్‌ను 'ధనిక పార్టీ'గా ఆమె అభివర్ణించారు. పార్టీ ఆవిర్భావం రోజున అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి, ఉద్యమకారులతో కలిసి వేదికను పంచుకుంటామని తెలిపారు. డీఎస్పీ విశారదన్ మహరాజ్‌తో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో సిద్ధిపేట లేదా గజ్వేల్‌లో మహిళా రిజర్వేషన్లు అమలైతే అక్కడి నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కవిత సూచనప్రాయంగా తెలిపారు. ఆడబిడ్డకు ఓటేయడం అనేది ఒక ఎమోషన్ అని వ్యాఖ్యానించారు. ఢిల్లీ మద్యం కేసు కొట్టివేతను ఉద్దేశిస్తూ.. "అదృష్టవంతుడిని ఎవరూ ఆపలేరు, ప్రకృతి నాకు సహకరిస్తోంది" అని ఆమె అన్నారు. భగవద్గీతలో ఉన్న నీతి ప్రకారం యుద్ధం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఇదే సమయంలో చంద్రబాబు నాయుడు కష్టపడి పనిచేస్తారని, పార్టీ నిర్మాణంలో టీడీపీ చాలా బలంగా ఉంటుందని ప్రశంసించడం గమనార్హం.

# త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత.

**కర్నూలు (ప్రతినిధి ఏప్రిల్ 5 సీమకిరణం న్యూస్)** త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనంతో పాటు ఆలయ నిర్వహణకు నిధులు కూడా ఇవ్వనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విద్యతోనే కురబల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీపరంగా కురబలకు ప్రాధాన్యమిచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కర్నూలులో ఆదివారం జరిగిన కురబల ఆత్మీయ సమావేశంలో ఎంపీ బత్తిపాటి నాగరాజుతో కలిసి ఆమె పాల్గొని ప్రసంగించారు. ఐక్యతతోనే కురబల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విద్యతోనే పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందని, కురబలు తమ బిడ్డలకు ఉన్నత విద్యలు అభ్యసించేలా ప్రోత్సాహించాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకతీతంగా ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలియజేస్తూ, అధికార పార్టీగా కురబల అభ్యున్నతికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. భక్త కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడమే కాకుండా, శాశ్వత జీవో కూడా ఇచ్చామన్నారు. త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం అందించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదే విషయమై ఇటీవల సీఎం చంద్రబాబుతో చర్చించినట్లు తెలిపారు. గౌరవ వేతనంతో పాటు ఆలయ నిర్వహణకు నిధులు కూడా ఇవ్వనున్నామన్నారు.



స్థానిక సంస్థల ఎన్నికల్లో కురబలకు ప్రాధాన్యమిచ్చేలా చర్య లు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కురబలు జిల్లాలు, మండలాల వారీగా తక్షణమే కుల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర స్థాయి కమిటీ నియామకానికి ఆసక్తి కలిగిన వారు తమ పేర్లు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా కురబ రాష్ట్ర సంక్షేమ సంఘ అధ్యక్షునిగా ఎస్.కే. మల్లికార్జున, గౌరవ అధ్యక్షుడిగా తట్టే అర్జునరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా రెడ్డి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కర్నూలు శ్రీనివాసరావు, మదనపల్లి లక్ష్మన్న, గుంటూరు సత్యనారాయణ రాజు, నంద్యాల శ్రీరాములు, జనరల్ సెక్రటరీగా ఏలూరి సూర్యనారాయణ, కోశాధికారిగా సంతల శ్రీరాములును అందరి సూచన మేరకు ఎంపిక చేశారు.



కార్యదర్శులుగా మహేంద్ర (కర్నూలు), చెన్నప్ప (కొత్తచెరువు), దోనస్వామి (అనంతపురం), వెంకటేశ్వరరావు (మచిలీపట్నం), రఘు (రాయచోటి), కాంతారావు (పీలేరు), ప్రచార కార్యదర్శులుగా ఆదోని సంతోష్, పెనుకొండ రామాంజినేయులు, తిరుపతి శ్రీనివాసులు, బాపట్ల పరమేశ్వరరావు, బక్క రామకృష్ణను ఎంపిక చేశారు. ఎంపికైన వారు కురబల సంక్షేమానికి కృషి చేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి సవితకు కురబ సామాజిక వర్గీయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, కర్నూలు జిల్లాకు చెందిన కురబ సామాజిక వర్గీయులు, వివిధ పార్టీలకు చెందని కురబ నేతలు పాల్గొన్నారు. జారీచేసిన వారు.రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యుల వారి కార్యాలయం.

# సిపిఐ కార్యకర్త ఈశ్వరయ్య మృతి

## క్రిష్ణగిరి మండల సమితి తరపున బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

## ఈశ్వరయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి పార్టీ ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించిన సిపిఐ జిల్లా సమితి సభ్యుడు టి. కృష్ణ






**వెల్దుర్తి, ఏప్రిల్ 05, (సీమకిరణం న్యూస్) :** కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామానికి చెందిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శాఖ సభ్యుడు బి. ఈశ్వరయ్య మరణించారు. ఆయన మృతి పట్ల పార్టీ నాయకులు, గ్రామస్తులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈశ్వరయ్య పార్థివ దేహానికి సిపిఐ నాయకులు పూలమాలలు అర్పించి, పార్టీ ఎర్రజెండా కప్పి నివాళులు ఘటించారు. అనంతరం వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా క్రిష్ణగిరి మండల సమితి తరపున బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు టి. కృష్ణ, మండల నాయకులు పరమేశ్వర్ రెడ్డి, రామాంజనేయులు, గ్రామ నాయకులు అల్లా ప్రకాష్, గిడ్డయ్య, కత్తి సుంకన్న, చిన్న మాధులు, తదితరులు పాల్గొన్నారు.

# వివాహ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వైయస్ఆర్సీపీ

# నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి



**కర్నూలు (ప్రతినిధి ఏప్రిల్ 04 సీమకిరణం న్యూస్)** ఆదివారం పాణ్యం మండలం గగ్గటూరు గ్రామంలో మాజీ సర్పంచ్ రామాంజనేయులు కుమారుడు వివాహానికి ముఖ్య అతిథిగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కల్లూరు మండలం పర్ల గ్రామంలో పోలుకంటి శ్రీరాములు కుమారుడు అనిల్ - రమ్యాల వివాహానికి ముఖ్యఅతిథిగా హాజరై, నూతన



వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి.ఈ కార్యక్రమంలో పాణ్యం మండలం నాయకులు పాణ్యం మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణ రెడ్డి, భూపనపాడు రామలక్ష్మయ్య, కొనిదేడు మధు సుధన్ రెడ్డి, కొత్తూరు



కృష్ణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, పిన్నాపురం సత్యాలు, కొత్తూరు నారాయణ స్వామి, శివరామి రెడ్డి, తొగర్చేడు నాగేంద్ర, వడ్డుగండ్ల రాముడు, మద్దూరు సుధాకర్ తదితరులు మరియు కల్లూరు మండలం పర్ల గ్రామ నాయకులు అశోక్ రెడ్డి, భార్గవ్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి




**వెల్దుర్తి, ఏప్రిల్ 05, (సీమకిరణం న్యూస్) :** కర్నూలు జిల్లా, వెల్దుర్తి మండలం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 10 నుండి 12వ తేదీ వరకు అనంతపురం నుండి బండ్లపల్లి వరకు సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ , భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా, జాతీయ కార్యదర్శి వి ఎస్ నిర్మల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేతలు జల్లి విల్సన్,సిహెచ్ కోటేశ్వరరావు ఆవుల శేఖర్ ఆధ్వర్యంలో జరుగు పాదయాత్ర కార్యక్రమం వాల్ పోస్టర్లను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఏఐటియుసి జిల్లా కార్యదర్శి నక్కి లెనిన్ బాబు సిపిఐ వెల్దుర్తి మండల కార్యదర్శి టి కృష్ణ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు సిపిఐ పట్టణ కార్యదర్శి గిరి సహాయ కార్యదర్శి చిన్నమాదులు ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు మాధవస్వామి, ఏసన్న, సిపిఐ సీనియర్ నాయకులు రాజు, సిపిఐ చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు అనిల్, సిపిఐ నాయకులు ఏసన్న, మధు తదితరులు పాల్గొని వెల్దుర్తిలోని సిపిఐ కార్యాలయంలో విడుదల చేశారు.

# సామాజిక న్యాయం, అట్టడుగు వర్గాల

# అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు డా. బాబూ జగ్జీవన్ రాం



## డా. బాబూ జగ్జీవన్ రాం సేవలు భావితరాలకు స్ఫూర్తి దాయకం.

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.

**కర్నూలు (ప్రతినిధి ఏప్రిల్ :05 సీమకిరణం న్యూస్)** భారత స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు డా. బాబూ జగ్జీవన్ రాం అని, వారి సేవలు భావితరాలకు స్ఫూర్తి దాయకం అని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. ఆదివారం 119వ జయంతి సందర్భంగా ఆర్.ఎస్. కూడలి ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి జిల్లా కలెక్టర్, కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ, ప్రజాసంఘాల నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రంలో జన్మించిన డా. బాబూ జగ్జీవన్ రామ్ చిన్ననాటి నుంచే అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూ సామాజిక సమానత్వానికి కట్టుబడి ఉన్నారు. విద్యార్థి దశలోనే వివక్షకు వ్యతిరేకంగా నిలబడి, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చురుకైన పాత్ర పోషించారన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలతో ప్రేరణ పొందిన ఆయన, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా దేశ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. డా. జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్యం తర్వాత కేంద్ర మంత్రివర్గంలో అనేక ముఖ్యమైన బాధ్యతలు నిర్వర్తించారన్నారు. వ్యవసాయం, రక్షణ, కార్మిక శాఖలలో ఆయన చేసిన సంస్కరణలు దేశాభివృద్ధికి దోహదపడ్డాయన్నారు. ముఖ్యంగా కార్మికుల సంక్షేమం



కోసం తీసుకున్న చర్యలు, పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచాయన్నారు. 1946 నుండి 1979 వరకు వివిధ కీలక పదవుల్లో పనిచేసిన ఆయన, 1977లో ఉప ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించి దేశ రాజకీయాల్లో విశిష్ట స్థానం సంపాదించారన్నారు. ఆయన నాయకత్వంలో అనేక ప్రజాహిత కార్యక్రమాలు అమలయ్యాయన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అపారమైనన్నారు. సమాన అవకాశాలు, విద్య, ఉపాధి కల్పనలో ఆయన చేసిన కృషి దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిందన్నారు. సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. డా. బాబూ జగ్జీవన్ రామ్ జీవితం నేటి యువతకు మార్గదర్శకం అని, సమాజానికి సేవ చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని ఆయన బోధించారని కలెక్టర్ తెలిపారు. ఆయన చేసిన సేవలు, ఆయన చూపించిన మార్గం దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని, డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల విద్య, వసతి, ఆరోగ్య సదుపాయాల మెరుగుదలకు సమగ్ర చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రీ-మెట్రిక్, కళాశాల వసతి గృహాల నిర్వహణను మరింత బలోపేతం చేసి, విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 29 ప్రీ-మెట్రిక్ వసతి గృహాల్లో 5165 మంది, 8 కళాశాల వసతి గృహాల్లో 1403 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులకు నోటుబుక్స్, బెడ్ షీట్లు, పాత్రలు పంపిణీ చేయడంతో పాటు, పౌష్టికాహారం మరియు మిల్లెట్ ఆధారిత ఆహారం అందిస్తున్నామని చెప్పారు. వసతి గృహ భవనాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, మరమ్మత్తులు, టాయిలెట్లు, బాత్రూములు, మస్కిటో మెష్ల



నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. విద్యా ఫలితాల పరంగా గత ఏడాది పదో తరగతిలో 97.91%, ఇంటర్మీడియట్‌లో 92.36% ఉత్తీర్ణత సాధించామని, ఈ సంవత్సరం 100% ఫలితాల లక్ష్యంతో చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ద్వారా కోట్ల రూపాయలు జమ చేయడంతో పాటు "తల్లికి వందనం" పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 169 మంది ఎస్‌సి అభ్యర్థులకు (ఎస్ జి టి --121, ఎస్ఏ --48) మూడు నెలలపాటు వసతి, శిక్షణతో కూడిన ఉచిత మెగా డీఎస్సీ కోచింగ్ నిర్వహించగా, 32 మంది అభ్యర్థులు కాల్ లెటర్స్ సాధించారన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ (డే స్కాలర్ ఒ రెసిడెన్షియల్) పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారు. అదేవిధంగా ఎస్‌సి కుటుంబాలకు ఉచిత విద్యుత్, పిఎంఏజెఏవై కింద గూడూరు బాలికల వసతి గృహం మరియు కంబాలపాడు బాలుర వసతి గృహాల నిర్మాణానికి మొదటి విడతగా మొత్తం రూ.3.00 కోట్లు (ప్రతి భవనానికి రూ.1.50 కోట్లు చొప్పున) నిధులు విడుదల చేయబడినాయని సంబంధిత పనుల టెండర్ ప్రక్రియ పూర్తై, ప్రస్తుతం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని జిల్లా కలెక్టర్ వివరించారు. అనంతరం డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నిర్వహించి వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో గెలుపొందిన హాస్టల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక, డిఎస్పి మహబూబ్ బాషా, ఏపీ డబ్ల్యూ ఐ డి సి డైరెక్టర్ నాగముని, డివిఎంసి సభ్యులు మాలతి, సురేష్ గౌడ్, మద్దిలేటి, మధు నాయక్, ఎస్సీ ఎస్టీ ప్రజాసంఘాల నాయకులు రాజకుమార్ అనంతరత్నం మాదిగ, కైలాస్ నాయక్, యోగేష్ నాయక్, చంద్రప్ప కె. వెంకటేష్ సోమ సుందర్ మాదిగ నాగేశ్వరి ఎన్సీహెచ్ బజారన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తిలో ఘనంగా

# బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు






**వెల్దుర్తి, ఏప్రిల్ 05, సీమకిరణం న్యూస్) :** భారత మాజీ ఉప ప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను వెల్దుర్తి లో ఘనంగా నిర్వహించారు. సామాజిక న్యాయం, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా తొలి ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అసమాన పోరాటం చేశారని కర్నూలు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రెడ్డి పోగు భాస్కర్ మాదిగ కొనియాడారు. స్థానిక వెల్దుర్తి మండల ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు నాయకంటి గిడ్డయ్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ రక్షణ, వ్యవసాయ, కార్మిక శాఖల మంత్రిగా కీలక బాధ్యతల్లో కొనసాగిన జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్యానంతర స్వయంపాలనలో దేశప్రగతిలో పాలుపంచుకున్న గొప్పవ్యక్తి అని కీర్తించారు. ఆయన దళిత, బహుజన వర్గాలకు ఆర్థిక, రాజకీయాల్లో సామాజిక న్యాయం దక్కినప్పుడే బాబూ జగ్జీవన్‌రామ్‌కు మనం అర్పించే ఘన నివాళి అని అలాగే భారత రత్నా ఇవ్వాలని పునరుద్ఘాటించారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల సీనియర్ నాయకులు మోసపోగు బజారన్న మాదిగ, కావూరి మోష మాదిగ, జగ్గుల బజారు మాదిగ, సూరి, పశువుల సిద్దయ్య, వెంకటేశ్వర్లు, సతీషు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# కురుబ సమాజ అభ్యున్నతి కి ప్రభుత్వం కట్టుబడి ఉంది

# కురుబ సంగం ఆత్మీయ సమావేశంలో మంత్రి సవిత



**కర్నూలు (ప్రతినిధి ఏప్రిల్ 5 సీమకిరణం న్యూస్)** కర్నూలు పట్టణంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర కురుబ సంగం నాయకుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత ఒ జౌళి శాఖల మంత్రి సవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ కురుబ సంఘం అభివృద్ధి, సంఘ ఐక్యత మరియు భవిష్యత్ కార్యాచరణపై నాయకులతో విస్తృతంగా చర్చించారు. కురుబ సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో ముఖ్యంగా సంఘ ప్రతిష్టను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర కురుబ సంగం నాయకులు ఏకాభిప్రాయంతో రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన ఎస్.కే. మల్లికార్జునను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత ఆయనకు అభినందనలు తెలుపుతూ, సంఘాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించాలని ఆకాంక్షించారు.ఈ సమావేశానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కురుబ సంఘం నాయకులు, సభ్యులు, అలాగే పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్ర కురుబ సంఘం కమిటీ వివరాలు. అధ్యక్షుడు: ఎస్.కే. మల్లికార్జున గౌరవ అధ్యక్షుడు: తట్టే అర్జునరావు వర్కింగ్ ప్రెసిడెంట్ :రెడ్డి ప్రసాద్

**ఉపాధ్యక్షులు:**

కర్నూలు శ్రీనివాసరావు, మదనపల్లి లక్ష్మన్న, గుంటూరు సత్యనారాయణ రాజు, నంద్యాల శ్రీరాములు

జనరల్ సెక్రటరీ: ఏలూరి సూర్యనారాయణ

కోశాధికారి: సంతల శ్రీరాములు

**కార్యదర్శులు:**

మహేంద్ర (కర్నూలు), చెన్నప్ప (కొత్తచెరువు), దోనస్వామి (అనంతపురం), వెంకటేశ్వరరావు (మచిలీపట్నం), రఘు (రాయచోటి), కాంతారావు (పీలేరు)ప్రచార కార్యదర్శులు:ఆదోని సంతోష్,పెనుకొండ రామాంజినేయులు, తిరుపతి శ్రీనివాసులు, బాపట్ల పరమేశ్వరరావు, బక్క రామకృష్ణ..

# ఘనంగా పునరుత్థాన పండుగ వేడుకలు

## సీఎస్ఐ ఆలయ నిర్మాణం కోసం లక్ష "రూ" విరాళం అందజేసిన గుమ్మల రాజేష్ కుటుంబం



**పెద్దకడబూరు ఏప్రిల్ 5 సీమకిరణం న్యూస్)** మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలో స్థానిక సిఎస్ఐ చర్చిలో పాస్టర్ యు ముత్తు మనోహర్ బాబు అలాగే సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం పునరుత్థాన పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విశ్వాసులకు వాక్య సందేశం ఇస్తూ మనకోసం మన పాపాల కోసం సిలువలో మరణించి మృత్యుంజయుడైన ఏసుక్రీస్తు ప్రభులవారు మరణించి తిరిగి లేచాడని క్రైస్తవుల విశ్వాసం ఆదివారం తెల్లవారు జాము నుండి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న సీఎస్ఐ ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన గుమ్మల రాజేశ్ దంపతులు ఈస్టర్ సందర్భంగా సంఘ పెద్దల ఆధ్వర్యంలో స్థానిక సంఘ కాపరి ముత్తు మనోహర్ బాబుకు విరాళం మొత్తాన్ని అందజేశారు. చర్చి అభివృద్ధికి భక్తుల సహకారం ఎంతో అవసరమని పాస్టర్ పేర్కొన్నారు. రాజేశ్ దాతృత్వాన్ని అభినందిస్తూ, వారి సహాయం చర్చి సేవా కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం సంఘమంతా కలిసి రాజేష్ కుటుంబానికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఐ సంఘ విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు బిగ్ అలర్ట్.. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన ఇండియన్ ఆయిల్.. లీటర్ ఎంతంటే?



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పవర్ పెట్రోల్ ధరలను పెంచిన నయారా ఎనర్జీ వంటి ప్రైవేట్ కంపెనీల బాటలోనే ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కూడా నడుస్తోంది. తాజాగా ఇండియన్ ఆయిల్ తమ ప్రీమియం ఇంధన ధరలను పెంచింది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల వల్ల పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం నెలకొంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు, సహజ వాయువు సరఫరాలో అంతరాయం ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచములు ధరలు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో దేశీ ప్రభుత్వం రంగ సంస్థ అయిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రీమియం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. హై-ఎండ్ లగ్జరీ కార్లు, సూపర్ బైక్‌లలో ఉపయోగించే ఎక్స్‌పీ100 పెట్రోల్ ధరను లీటరుకు రూ.11 పెంచింది. దీంతో ఎక్స్‌పీ100 లీటర్ పెట్రోల్ ధర రూ.160కి చేర్చారు. ప్రీమియం డీజిల్ వేరియంట్ 'ఎక్స్‌ట్రా గ్రీన్' ధరను లీటరుకు రూ.91.49 నుంచి రూ.92.99కి పెంచింది. ఇదిలా ఉండగా, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లో సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయి. ధరల పెరుగుదలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.13 నుండి రూ.3కి, డీసెల్‌పై రూ.10 నుండి సున్నాకి తగ్గించింది. అయినప్పటికీ, అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వినియోగదారులకు తక్షణ ఉపశమనం లభించే సూచనలు తక్కువగా ఉన్నాయి. ఇదిలా ఉండగా బుధవారం చమురు కంపెనీలు 19 కేజీల కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ.195.50 పెంచాయి. ఢిల్లీలో ఇప్పుడు ఒక కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్ ధర రూ.2,078.50కి చేరింది. దీనితో పాటు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు కూడా భారీగా పెరిగాయి. ప్రస్తుతం కిలోలీటరుకు టెర్బైన్ ఫ్యూల్ ధర రూ.2.07 లక్షల రికార్డు స్థాయికి చేరడంతో, విమాన ఛార్జీలు పెరిగే అవకాశం ఉందనే ఆందోళనలు పెరిగాయి. ఇక జెట్ ఫ్యూయల్ ధరలు కిలోలీటరుకు రూ.2 లక్షలు దాటడం ఇదే మొదటిసారి. అయితే, దేశీయ విమానయాన సంస్థలు జెట్ ఇంధన ధరలలో కేవలం 8.5 శాతం పెంచినట్టు పీటీఐ వార్తా సంస్థ నివేదించింది.

## ప్రపంచ సంక్షోభం వేళ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం.. కీలక సుంకాలు రద్దు..!



మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా నెలకొన్న ప్రపంచ సంక్షోభం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఎరువుల కంపెనీలకు గణనీయమైన ఉపశమనం కల్పించింది. అమ్మోనియం నైట్రేట్‌పై దిగుమతి సుంకాన్ని మాఫీ చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పలు పెట్రోకెమికల్ ఉత్పత్తులపై కూడా దిగుమతి సుంకాన్ని ఎత్తివేసింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా నెలకొన్న ప్రపంచ సంక్షోభం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఎరువుల కంపెనీలకు గణనీయమైన ఉపశమనం కల్పించింది. అమ్మోనియం నైట్రేట్‌పై దిగుమతి సుంకాన్ని మాఫీ చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పలు పెట్రోకెమికల్ ఉత్పత్తులపై కూడా దిగుమతి సుంకాన్ని ఎత్తివేసింది. ఈ మాఫీ ఏప్రిల్ 2వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు అమల్లో ఉంటుంది. పలు కీలక ముడి పదార్థాలపై దిగుమతి సుంకాలను సున్నాకు తగ్గించడం ద్వారా ప్రభుత్వం ఎరువులు, రసాయన పరిశ్రమలకు ఉపశమనం కల్పించింది. ప్రపంచ యుద్ధాలు, సరఫరా కొరత కారణంగా వ్యయ ఒత్తిళ్లు పెరుగుతున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడింది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. సుమారు 40 రకాల పెట్రోకెమికల్ ముడి పదార్థాలు, ఇంటర్మీడియట్‌లపై దిగుమతి సుంకాలను రద్దు చేశారు. వీటిలో అమ్మోనియం నైట్రేట్, మెథనాల్, ఫినాల్, పివిసి, పాలీప్రొపిలీన్ వంటి అనేక కీలక రసాయనాలు ఉన్నాయి. ప్రస్తుత ప్రపంచ సంక్షోభం మధ్య ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, పరిశ్రమలకు ఉపశమనం కల్పించడానికి ఈ చర్య తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రభుత్వ నిర్ణయం ముఖ్యంగా ఎరువుల కంపెనీలకు గణనీయమైన ఉపశమనాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. ఎరువుల ఉత్పత్తికి అమ్మోనియం నైట్రేట్ వంటి రసాయనాలు అత్యవసరం. ఇది ఉత్పత్తి వ్యయాలను నియంత్రించి, సరఫరా వ్యవస్థపై ఒత్తిడిని తగ్గిస్తుంది. అమ్మోనియం నైట్రేట్‌పై ఉన్న వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్సును కూడా తొలగించడంతో, ఎరువుల రంగానికి అదనపు ప్రయోజనాలు చేకూరాయి. మొత్తంమీద, ఈ ప్రభుత్వ చర్య పరిశ్రమకు వ్యయాలను తగ్గించే ఒక ప్రధాన ఉపశమన ప్యాకేజీగా పరిగణించబోతుంది. ఈ నిర్ణయం పరిశ్రమలకు ముడి పదార్థాలను చౌకగా అందుబాటులోకి తెస్తుంది. సరఫరా కొరతను తగ్గించడంలో సహాయపడుతుంది. ఉత్పత్తి వ్యయాలను తగ్గిస్తుంది. ఇది ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. మినహాయింపు పొందిన రసాయనాలలో దాదాపు ప్రతి రసాయన పరిశ్రమలో ఉపయోగించే మిథనాల్, ఎసిటిక్ యాసిడ్, ఫినాల్, టోలుయెన్, అమ్మోనియా వంటి ప్రాథమిక పారిశ్రామిక రసాయనాలు ఉన్నాయి. పెట్రోకెమికల్, ప్లాస్టిక్ ముడి పదార్థాలపై సుంకాల తొలగింపు ప్యాకేజింగ్, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, వినియోగ వస్తువుల రంగాలకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఉన్నత శ్రేణి ఇంజనీరింగ్ పదార్థాలను ఏరోస్పేస్, రక్షణ, వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్‌లో ఉపయోగిస్తారు. ఈ రసాయనాలలో చాలా వాటిని్రాఎజ పైపులు, పెయింట్లు, పూతలు, ఇన్సులేషన్ పదార్థాల తయారీలో కూడా ఉపయోగిస్తారు. ఈ రసాయనాలను ఆటోమోటివ్ పరిశ్రమలో ప్లాస్టిక్ భాగాలు, సీట్ ఫోమ్ తయారీకి కూడా ఉపయోగిస్తారు. సుంకం తొలగింపు విధించిన ఉత్పత్తులలో ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో ఉపయోగించే అనేక రసాయనాలు ఉన్నాయి. ఇది మందుల ఉత్పత్తిని సులభతరం చేస్తుంది. అమ్మోనియం నైట్రేట్‌పై సుంకం తొలగింపు ఎరువుల లభ్యతను నిర్ధారిస్తుంది. వాటి ధరలను స్థిరీకరించడంలో సహాయపడుతుంది. అదనంగా, ఇతర ముఖ్యమైన రంగాలలో సరఫరా గొలుసులు బలంగా ఉంటాయి.

## యుద్ధంపై ట్రంప్ సంచలన ప్రకటన.. దెబ్బకు కుప్పకూలిన దేశీయ స్టాక్ మార్కెట్లు



నిన్నా, మొన్నా ఊపుమీదున్న దేశీయ స్టాక్ మార్కెట్‌లో మళ్లీ పతాళానికి చేరుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ సూచీలు, ఇరాన్‌తో యుద్ధంపై ట్రంప్ చేసిన కీలక వ్యాఖ్యల నేపథ్యంలో మార్కెట్ సూచీలను కుదిపేశాయి. గురువారం మార్కెట్ ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే పెట్టుబడిదారులు తమ సంపదలో భారీ నష్టాన్ని చవిచూశారు. అమెరిగా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన దేశీయ స్టాక్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ట్రంప్ ప్రకటన తర్వాత ఒక్కసారిగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడంతో ఇన్వెస్టర్లు భారీ నష్టాన్ని చవిచూశారు. దీంతో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్‌లో భారీ నష్టాలలో ప్రారంభం అయ్యాయి. బుధవారం మార్కెట్ ముగిసే సమయానికి, బీఎస్‌ఈ సెన్‌సెక్స్ కంపెనీల మొత్తం మార్కెట్ మూలధనం రూ. 4,22,01,433.48 కోట్లుగా నమోదు కాగా.. గురువారం ఉదయం 10:03 గంటలకల్లా, ఇది రూ. 4,11,94,176 కోట్లకు పడిపోయింది. అంటే, కేవలం ఒక గంటలోపే రూ. 10 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై చేసిన తాజా హెచ్చరికల కారణంగా చమురు ధరలు పెరగడంతో, దీూజు సెన్‌సెక్స్, నిఫ్టీ 50 సూచీలు రెండూ భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. మార్కెట్ ప్రారంభ సమయంలో ఉదయం 9.20 గంటలకు 1454.53 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్ 71,679.79 వద్ద స్థిరపడింది. ఇక 453.9 పాయింట్ల నష్టంతో నిఫ్టీ 22,222.50 వద్ద కొనసాగుతోంది.

**రంగాల వారీగా అమ్మకాల ఒత్తిడి**

దాదాపు అన్ని రంగాల్లోనూ మదుపరులు షేర్ల అమ్మకానికి మొగ్గు చూపుతున్నారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ షేర్లు దాదాపు 1.6శాతం పతనం అవ్వగా మిడ్-క్యాప్ అండ్ స్మాల్-క్యాప్, వరుసగా 1.2 శాతం, 1.5% మేర నష్టపోయాయి. ఇక ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రా షేర్లు కూడా భారీగా పడిపోయాయి. ఇక ఫార్మా అండ్ ఏవియేషన్ రంగంలో విమానయాన, ఔషధ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

**నిలకడగా ఐటీ రంగం**

మార్కెట్ అంతా నష్టాల్లో ఉన్నప్పటికీ, ఐటీ షేర్లు కొంత మేర నిలకడగా ఉన్నాయి.

# విమానం మైలేజీ ఎంత ఇస్తుందో తెలుసా..? ఒక్కసారి ట్యాంక్ ఫుల్ చేస్తే..




మనం బైక్‌కో, కార్‌కో పెట్రోల్ పోయించాలంటే లీటర్ల లెక్క చూస్తాం.. కానీ ఆకాశంలో వేగంగా దూసుకుపోయే విమానాల కథ వేరు.. ఒక పెద్ద విమానం ట్యాంక్ ఫుల్ చేయాలంటే వేల లీటర్లు కాదు, ఏకంగా లక్షల లీటర్ల ఇంధనం కావాలి. అసలు విమానాల్లో వాడే ఇంధనం ఏంటి? ఎంత మైలేజ్ ఇస్తుంది అనేది తెలుసుకుందాం.. సాధారణంగా ఒక కారు ట్యాంక్ సామర్థ్యం 30 నుండి 50 లీటర్లు ఉంటుంది. కానీ ఆకాశంలో వేగంగా దూసుకుపోయే విమానాల ఇంధన ట్యాంకుల గురించి ఎప్పుడైనా ఆలోచించారా? ఒక పెద్ద విమానం ఒకేసారి వందలాది కార్లకు సరిపడా ఇంధనాన్ని తన ట్యాంక్‌లో నింపుకోగలదు. విమానం పరిమాణం, అది ప్రయాణించే దూరాన్ని బట్టి ఇంధన సామర్థ్యం మారుతుంటుంది. బోయింగ్ 737, ఎయిర్‌బస్ ఌ320 విమానాల్లో సుమారు 23,000 నుండి 27,000 లీటర్ల ఇంధనం పడుతుంది. బోయింగ్ 777 సామర్థ్యం ఏకంగా 1,80,000 లీటర్ల వరకు ఉంటుంది. ప్రపంచంలోనే అతిపెద్ద విమానమైన ఎయిర్‌బస్ ఌ380లో ట్యాంక్ నింపడానికి 3,20,000 లీటర్ల ఇంధనం అవసరం.

**విమానాల్లో వాడేది పెట్రోలా డీజిలా?**

చాలామంది విమానాలు పెట్రోల్ లేదా డీజిల్‌తో నడుస్తాయని అనుకుంటారు. కానీ అది నిజం కాదు. పెద్ద జెట్ విమానాలు జెట్-ఏ, లేదా జెట్-ఏ-1 రకానికి చెందిన ఇంధనాన్ని ఉపయోగిస్తాయి. ఇది అత్యంత శుద్ధి చేయబడిన స్వచ్ఛమైన కిరోసిన్. విమానాలు చాలా ఎత్తులో ప్రయాణిస్తున్నప్పుడు ఉష్ణోగ్రతలు -40ీజ కంటే తక్కువకు పడిపోతాయి. అటువంటి స్థితిలో ఇంధనం గడ్డకట్టకుండా ఉండటానికి ప్రత్యేక రసాయనాలను ఇందులో కలుపుతారు. చిన్న పిస్టన్ ఇంజిన్ విమానాలు మాత్రం ఏవ్‌గాస్ అనే పెట్రోల్ లాంటి ఇంధనాన్ని వాడుతాయి.

**గంటకు ఎన్ని వేల లీటర్ల ఖర్చు..?**

ఒక పెద్ద విమానం గాలిలో ఎగురుతున్నప్పుడు గంటకు 5,000 నుండి 12,000 లీటర్ల ఇంధనాన్ని ఖర్చు చేస్తుంది. అంటే సెకన్ల వ్యవధిలోనే లీటర్ల కొద్దీ ఇంధనం కాలిపోతుంది. అందుకే విమానయాన సంస్థలకు ఇంధన ఖర్చే అతిపెద్ద భారం.

**భవిష్యత్తులో విమాన ప్రయాణం భారం కానుందా?**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, ముఖ్యంగా ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతల వల్ల చమురు సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. దీనివల్ల జెట్ ఇంధనం ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా విమానయాన సంస్థలు మొక్కలు లేదా వ్యర్థాల నుండి తయారు చేసే సుస్థిర విమానయాన ఇంధనం (ూఖీ) వైపు మొగ్గు చూపుతున్నాయి. అయితే ఇది ప్రస్తుతం చాలా ఖరీదైనది కావడంతో భవిష్యత్తులో విమాన టికెట్ల ధరలు సామాన్యులకు మరింత భారమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

# డొనాల్డ్ ట్రంప్ ఒక్క వార్నింగ్‌తో కుప్పకూలిన భారత మార్కెట్లు! అసలు ఏం జరిగిందంటే?




భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో గురువారం ఒక బ్లాక్ డేగా మిగిలిపోయింది. కొత్త ఆర్థిక సంవత్సరం ఉత్సాహంగా ప్రారంభమవుతుందని భావించిన ఇన్వెస్టర్లకు మార్కెట్ కోలుకోలేని షాక్ ఇచ్చింది. ట్రేడింగ్ ప్రారంభమైన కొద్ది సేపటికే మార్కెట్లు భారీ పతనాన్ని మూటగట్టుకున్నాయి. కేవలం 5 సెకన్ల వ్యవధిలోనే ఇన్వెస్టర్ల సంపద దాదాపు 9 లక్షల కోట్ల రూపాయల మేర ఆవిరైపోవడం గమనార్హం. దీనికి ప్రధాన కారణం అంతర్జాతీయంగా తలెత్తిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలేనని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై చేసిన దూకుడు వ్యాఖ్యలు ప్రపంచ మార్కెట్లను వణికించాయి. ఈ ప్రభావం భారతీయ స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీలపై తీవ్రంగా పడింది. ఉదయం లాభాలతో ప్రారంభమైన గిఫ్ట్ నిఫ్టీ ఒక్కసారిగా 300 పాయింట్లకు పైగా పడిపోవడం ఇన్వెస్టర్లలో భయాందోళనలను పెంచింది. అసలు మార్కెట్ ఎందుకు పడిపోయింది? క్రూడాయిల్ ధరలు ఎలా మారుతున్నాయి ఇన్వెస్టర్లు ఇప్పుడు ఏం చేయాలి? వంటి పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.

**డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికతో మారిన సీన్..**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై కఠిన వైఖరిని అవలంబిస్తూ చేసిన ప్రకటన మార్కెట్లను కుదిపేసింది. "ఇరాన్‌పై దాడులు కొనసాగుతాయి, అవసరమైతే ఇంధన రంగాన్ని కూడా లక్ష్యంగా చేసుకుంటాం" అని ట్రంప్ హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలతో ఆసియా మార్కెట్లు తమ గరిష్ట స్థాయిల నుండి ఒక్కసారిగా పడిపోయాయి. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు.

**సెగ పెడుతున్న ముడి చమురు ధరలు**

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు (జతీబంవ వాఅశ్రీ) ధరలు అకస్మాత్తుగా 4 శాతానికి పైగా పెరిగాయి. గతంలో 100 డాలర్ల లోపు ఉన్న బ్రెంట్ క్రూడ్ ధర ఇప్పుడు బ్యారెల్‌కు 106 డాలర్లకు చేరుకుంది. ముడి చమురు ధరలు పెరగడం భారతదేశం వంటి దిగుమతి చేసుకునే దేశాలకు పెద్ద దెబ్బ. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉండటంతో రూపాయి విలువపై కూడా ఒత్తిడి పెరిగింది. డాలర్ సూచీ 100 మార్కుకు సమీపంలో ఉండటం భారత కరెన్సీకి ఆందోళన కలిగించే అంశం.

**ఆటో రంగం నుంచి సానుకూల సంకేతాలు**

మార్కెట్ ఇంత అస్థిరంగా ఉన్నప్పటికీ, ఆటోమొబైల్ రంగం మాత్రం కొంత ఆశాజనకమైన పనితీరును కనబరిచింది. మార్చి నెల సేల్స్ డేటాలో హీరో మోటోకార్ప్ అమ్మకాలు 9 శాతం పెరిగి 6 లక్షల యూనిట్లకు చేరగా, ఎగుమతులు ఏకంగా 15 శాతం వృద్ధి చెందాయి. అలాగే టీవీఎస్ మోటార్స్ 25 శాతం వృద్ధిని నమోదు చేసింది. అయితే, మార్కెట్ మొత్తం పతనంలో ఈ సానుకూలత కొట్టుకుపోయింది.

**ఇన్వెస్టర్లు ఏం చేయాలి?**

ప్రస్తుత పరిస్థితులపై జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ నిపుణుడు వినోద్ నాయర్ స్పందిస్తూ.. మార్కెట్ అనిశ్చితిగా ఉందని హెచ్చరించారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల మార్కెట్ ఎప్పుడైనా దిశ మార్చుకోవచ్చు. ఈ సమయంలో అనవసరమైన రిస్క్ తీసుకోవద్దని, ప్రపంచ పరిణామాలను నిశితంగా గమనిస్తూ తదుపరి అడుగులు వేయాలని సూచించారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కదలికలు ఉన్నప్పటికీ, భారీ పెట్టుబడులు పెట్టేముందు నిపుణుల సలహా తీసుకోవడం అవసరమని పేర్కొన్నారు. ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. స్టాక్ మార్కెట్ మరియు ఆర్థిక పరమైన విషయాలలో ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు తప్పనిసరిగా సర్టిఫైడ్ ఆర్థిక నిపుణులను సంప్రదించాలి.

# ఫోన్‌పే వాడుతున్నారా..? బీఅలర్ట్.. ఇలాంటోడు షాపునకు వచ్చాడో గల్లాపెట్టి గల్లంతే..



ఫేక్ ఫోన్‌పే ట్రాన్సాక్షన్‌తో దుకాణదారుని మోసం చేసిన ఘటన సంచలంగా మారింది. సాధారణ కస్టమర్‌లా వచ్చి, మొబైల్ స్క్రీన్‌లో పేమెంట్ అయ్యిందని చూపించిన కేటుగాడు వేల రూపాయల సరుకుతో పరారైన ఘటన కృష్ణాజిల్లా కంకిపాడులో వెలుగుచూసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫేక్ ఫోన్‌పే ట్రాన్సాక్షన్‌తో దుకాణదారుని మోసం చేసిన ఘటన సంచలంగా మారింది. సాధారణ కస్టమర్‌లా వచ్చి, మొబైల్ స్క్రీన్‌లో పేమెంట్ అయ్యిందని చూపించిన కేటుగాడు వేల రూపాయల సరుకుతో పరారైన ఘటన కృష్ణాజిల్లా కంకిపాడులో వెలుగుచూసింది. కంకిపాడు రైతుబజార్ సమీపంలోని అమీర్ కిరాణా షాప్‌లో ఈ మోసం చోటుచేసుకుంది. బుధవారం రాత్రి సమయంలో బైక్‌పై వచ్చిన ఓ కేటుగాడు. ప్రీమియం క్వాలిటీ బియ్యం బస్తాలు కావాలని యజమానిని అడిగాడు. మొదట సాధారణ కస్టమర్‌లా ప్రవర్తిస్తూ ధరలపై బేరసారాలు జరిపి, యజమానిలో నమ్మకం కలిగించాడు. మార్కెట్ రేట్లపై అవగాహన ఉన్నట్టుగా మాట్లాడడంతో ఎలాంటి అనుమానం రాలేదు. కొంతసేపటి చర్చల తర్వాత మూడు బియ్యం బస్తాలను కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదిరింది. అనంతరం డబ్బులు ఫోన్‌పే ద్వారా చెల్లిస్తానని చెప్పిన ఆ కేటుగాడు.. యజమాని మొబైల్ నెంబర్ తీసుకుని కొద్ది క్షణాల్లోనే ట్రాన్సాక్షన్ పూర్తయిందని చూపిస్తూ తన మొబైల్‌లో ఒక స్క్రీన్ ప్రదర్శించాడు. పేమెంట్ సక్సెస్ అని కనిపించిన ఆ స్క్రీన్‌ను నిజమని నమ్మిన యజమాని ఎలాంటి ధృవీకరణ చేయకుండా సరుకును అప్పగించాడు. అయితే సరుకును ఇచ్చిన కొద్దిసేపటికే యజమాని తన బ్యాంక్ అకౌంట్ చెక్ చేయగా.. డబ్బులు జమ కాలేదని తెలిసి షాక్‌కు గురయ్యాడు. అప్పటికే ఆ యువకుడు సరుకుతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో సుమారు పదివేల రూపాయలకు పైగా నష్టం జరిగినట్లు తెలుస్తోంది. దుకాణంలో అమర్చిన సీసీ కెమెరాల్లో కేటుగాడి కదలికలు స్పష్టంగా రికార్డ్ అయ్యాయి. దుకాణంలోకి రావడం నుంచి బియ్యం బస్తాలను తీసుకెళ్లే వరకు ప్రతి కదలిక కూడా ఫుటేజ్‌లో కనిపిస్తోంది. ముఖ్యంగా మొబైల్ స్క్రీన్ చూపించిన తీరు, అతని ప్రవర్తనను పరిశీలించినప్పుడు ఇది ముందుగానే పక్కా ప్రణాళికతో చేసిన మోసమని అనిపిస్తోంది. బాధిత దుకాణ యజమాని పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వీటి విలువ రూ. 10వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

**వీడియో చూడండి..**

సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇదే తరహాలో మరికొన్ని ప్రాంతాల్లో కూడా మోసాలు జరిగాయా అన్న కోణంలో విచారణ సాగుతోంది. రోజంతా కష్టపడి సంపాదించే చిన్న వ్యాపారులకు ఇలాంటి మోసాలు గట్టి దెబ్బగా మారుతున్నాయి. కేవలం ఒక స్క్రీన్‌ను నమ్మడం వల్లనే భారీ నష్టాలు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. పేమెంట్ చేశానన్నాడు.. స్క్రీన్ చూపించాడు.. నమ్మి సరుకు ఇచ్చాం.. అంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. డిజిటల్ పేమెంట్స్ విస్తరిస్తున్న నేపథ్యంలో వ్యాపారులు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. కేవలం స్క్రీన్‌షాట్‌లు లేదా మెసేజ్‌లను నమ్మకుండా, డబ్బులు నిజంగా బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయో లేదో నిర్ధారించుకోవాలని హెచ్చరిస్తున్నారు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com